# దేశ టైమ్స్
DESHA TIMES
TELUGU DAILY
తెలుగు దినపత్రిక



## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలకు:

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,


## ఎన్డీఎస్ఏ నివేదిక తప్పో.. లేదో బీజేపీ చెప్పాలి

హైదరాబాద్: కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను తెలంగాణ హైకోర్టు తప్పుబట్టలేదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారు?, బీఆర్ఎస్ సంబరాలు చేసుకునేలా కోర్టు తీర్పులో ఏముంది? అని చామల ప్రశ్నించారు. తీర్పు కాపీ చూశాక.. తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. అధికారులు, బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే మేడిగడ్డ కుంగిపోయిందని ఆరోపించారు. నాటి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే పిల్లర్లు కుంగినట్లు ఎన్డీఎస్ఏ చెప్పిందని వివరించారు.ఎన్డీఎస్ఏ నివేదిక తప్పో.. లేదో బీజేపీ చెప్పాలని కాంగ్రెస్ ఎంపీడిమాండ్ చేశారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా బీజేపీ సీబీఐ విచారణ చేయాలని కోరలేదన్నారు. కాళేశ్వరంపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ చేయించాలని చామల కిరణ్ డిమాండ్ చేశారు. ఘోష్ నివేదికపై తదుపరి కార్యాచరణను సాయంత్రంలోపల నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. కాళేశ్వరం అంశంలో క్లీన్ చిట్ కోసం హరీశ్ రావు ఢిల్లీలో ఏమైనా మంతనాలు చేశారా? అని ఆయన ప్రశ్నించారు.


నల్లగొండ సంపుటి:16 సంచిక:95 ఎడిటర్: సయ్యద్ పాష 23-04-2026 గురువారము పేజీలు :8 వెల:1/-


## కాళేశ్వరం కేసులో హైకోర్టు ఎవరికీ
# క్లీన్ చిట్ ఇవ్వలేదు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, : కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ ఈరోజు (బుధవారం) భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6 కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పు బట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుబట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఇంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం +ూ.వీం.చీశీ.6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని వ్యాఖ్యా నించారు.కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని, అని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుబట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చినట్లు తెలిపిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. ఇప్పటికే సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు.

ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని మూమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయింద న్నారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికి వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనబడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేండ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్చిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్లు, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి తమ నివేదికను వెల్లడించిందన్నారు.

## మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత



హైదరాబాద్, : మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. నాదెండ్ల భాస్కరరావు గత ఆరు నెలలుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. 20 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాదెండ్ల.. ఆరోగ్యం మరింత క్షీణించడంతో కన్నుమూశారు.నాదెండ్ల భాస్కరరావు 1935 జూన్ 23న గుంటూరులో జన్మించారు. 1978లో విజయవాడ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. చెన్నారెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు.1984 ఆగష్టు 16 నుంచి సెప్టెంబర్ 16 వరకూ కేవలం 31 రోజుల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఉన్నారు. రాష్ట్ర చరిత్రలో అత్యల్పకాలం పదవిలో ఉన్న సీఎంగా నాదెండ్ల నిలిచారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన నాదెండ్ల 1989లో తెనాలి నుంచి పోటీ చేసి అన్నాబత్తుని సత్యనారాయణపై ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1998లో ఖమ్మం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. నాదెండ్ల భాస్కర రావు మృతిపట్ల పలువురు నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రేపు(గురువారం) సాయంత్రం 4 గంటలకు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు జరగనున్నాయి.

## ఎమ్మెల్సీల నియామకంపై విచారణ వాయిదా..



హైదరాబాద్, : తెలంగాణలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించిన వివాదంపై సుప్రీం కోర్టులో విచారణ జులై 22వ తేదీకి వాయిదా పడింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం కొత్తగా సిఫార్సు చేసిన అభ్యర్థులపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్‌కు మరికొంత సమయం కావాలని అటార్నీ జనరల్ కోరడంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా సిఫార్సు చేసిన ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్ (అజారుద్దీన్) ల నియామకంపై కొత్త గవర్నర్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అటార్నీ జనరల్ వెంకటరమణి ధర్మాసనానికి వివరించారు. ఈ నెల 31తో ఆరు నెలల గడువు ముగుస్తున్న తరుణంలో, గవర్నర్ తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఈ విచారణను కొనసాగించాలా లేదా ముగించాలా అన్నది తేలుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాసోజు శ్రావణ్, కుర్రా సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా సిఫార్సు చేయగా.. అప్పటి గవర్నర్ తమిళిసై ఆ ఫైల్‌ను తిరస్కరించారు. దీన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు కోర్టును ఆశ్రయించారు. అయితే, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, కొత్త వారిని నియమించుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని గతంలోనే జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం అభిప్రాయపడింది. ఆ మేరకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాత సిఫార్సులను పక్కన పెట్టి.. కొత్త నోటిఫికేషన్ ద్వారా కోదండరాం, అమీర్ అలీ ఖాన్ పేర్లను ప్రతిపాదించింది. వీరి నియామకంపై కొత్త గవర్నర్ నిర్ణయం వెలువడితే ఈ న్యాయపరమైన చిక్కులు తొలగిపోయే అవకాశం ఉంది.

## ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ఆర్టీసీ
# సమ్మె విరమించాలని విజ్ఞప్తి: మంత్రి పొన్నం



హైదరాబాద్,: రాష్ట్ర వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచే బస్సులను నిలిపివేశారు కార్మికులు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాల్సిందే అంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె సైరన్ మోగించింది. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా సమ్మె విరమించాలని ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.'ఆర్టీసీ సోదరులకు నా కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి. సంస్థ పరిరక్షణ, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా.. సమ్మె విరమించాలని కోరుతున్నాను. సమస్యకు సమ్మె పరిష్కారం కాదు.. నలుగురు అధికారులతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. నాలుగు వారాల్లో కమిటీ నివేదిక ఇవ్వాలని ఆదేశించాం. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపా టు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి వ్యతిరేకతా లేదు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండూ పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చరించాల్సి ఉంది. అధ్యయనం చేయడా నికి నాలుగు వారాల గడువు అడిగాం. ఈ రెండు అంశాలూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దగ్గర చర్చిస్తామని నలుగురు అధికారుల కమిటీకి తెలియజేశాం' అని మంత్రి తెలిపారు.'ఆర్టీసీ విలీనం ఆలస్యమైనా ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయి. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం నాయకత్వ అంశాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పడగానే గతంలో పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీ క్లియర్ చేశాం. పెండింగ్ డీఏలు లేకుండా క్లియర్ చేశాం. 2013 పెండింగ్ బాండ్స్ క్లియర్ చేశాం. రూ.1205 కోట్లు ఉన్న పీఎఫ్ బకాయి లను రూ.600 కోట్లకు తగ్గించాం. రూ.690 కోట్లు ఉన్న సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గిం చాం. ఇవే కాకుండా నెల వారీగా పీఎఫ్, సీసీఎస్‌కి రూ.75 కోట్లు చెల్లిస్తున్నాం. ఉద్యోగులపై పనిభారం పడకుండా ఉండడానికి 4,538 ఉద్యోగాల నియామకాలు భర్తీ త్వరలోనే పూర్తవుతుంది' అని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.'అలానే సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న 1134 కారుణ్య నియామకాలు చేపట్టాం. గత ప్రభుత్వంలో వివిధ కారణాలతో శాశ్వతంగా సర్వీసు నుంచి రిమూవ్ అయిన వారిలో ఇప్పటి వరకు దాదాపు 250 మందికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. అన్ని అంశాలు పరిష్కారం చేస్తాం. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది.. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు చేయొద్దు. గత ప్రభుత్వంలో 10ఏళ్లుగా ఆర్టీసీలో ఏం జరిగిం దో కార్మికులందరికీ తెలుసు. రోజు 65 లక్షల మంది ప్రయాణం చేస్తుంటే.. అందులో 45 లక్షల మంది మహిళలే ఉన్నారు. సమ్మె విరమించాలని ప్రభుత్వం పక్షాన విజ్ఞప్తి చేస్తున్నా' అని మంత్రి అన్నారు.'మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరు. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలుసుకోవచ్చు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవచ్చు. పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బందులు కలగజేయవద్దు. పేదలకు కార్లలో పోయే స్థోమత లేదు. కాబట్టి ప్రతి ఒక్క ఆర్టీసీ కుటుంబ సభ్యుడికి, కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నా.. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం తరఫున కొట్లాడి సాధించుకుందాం. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుంది. మీ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా ఉన్నాం. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు. నేను విద్యార్థి నాయకుడిని కార్మికులకు అండగా ఉంటా. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు లైఫ్ లైన్ అయిన ఆర్టీసీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. మీ నాయకులకు నిరసనలు తెలియజేసే హక్కు ఉంది.. మిగతా వారంతా విధుల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేయాలని విజ్ఞప్తి చేస్తున్న' అని ఆర్టీసీ కార్మికులకు పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రతి 4 నిమిషాలకో మెట్రో ట్రైన్
## - ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో సర్వీసులు పెంపు




హైద్రాబాద్: ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో నగర వాసుల ప్రయాణాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు మెట్రో రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచాలని మెట్రోరైలు యాజమాన్యం నిర్ణయించింది. ఆర్టీసీ సమ్మె కాలంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎల్ టీఎంఆర్ హెచ్ 56 మెట్రో సర్వీసులు నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు తమ సర్వీసులను పెంచుతున్నట్లుగా ప్రకటించింది. మియాపూర్-ఎల్బీనగర్ మార్గంలో 4 నిమిషాలకో మెట్రో ట్రైన్ నడుపుతున్నట్లు తెలిపింది. నాగోల్-రాయదుర్గం మార్గంలో 3 నిమిషాల 40 సెకన్లకో మెట్రో ట్రైన్ నడుపుతున్నట్లు మెట్రో అధికారులు ప్రకటించారు. మియాపూర్ - ఎల్బీ నగర్ కారిడార్ : సాధారణంగా పీక్ అవర్స్‌లో 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు, నాన్-పీక్‌లో 4 నిమిషాల 50 సెకన్లకు ఒక రైలు. ఇప్పుడు రోజంతా 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు.నాగోల్ - రాయదుర్గ్ కారిడార్ : సాధారణంగా నాన్-పీక్‌లో 5 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు. ఇప్పుడు రోజంతా 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు. సాధారణంగా వారపు రోజుల్లో ఉదయం 8 నుండి 10:30 వరకు, సాయంత్రం 5 నుండి 8 వరకు మాత్రమే 56 రైళ్లు నడిపేవారు. నాన్-పీక్ అవర్స్‌లో 44 రైళ్లకు తగ్గించేవారు. సమ్మె కారణంగా ఇప్పుడు ఆ తగ్గింపు ఉండదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సర్వీసులు పొడిగించే అవకాశాన్ని ఎల్‌టీఎంఆర్‌హెచ్‌ఎల్ పరిశీలిస్తోందని స్పష్టం చేసిన హెచ్‌ఎంఆర్ఎల్ ఎండీ తెలిపారు.నగరంలో ప్రారంభమైన అద్దె బస్సుల రాకపోకలు : ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం, ఆర్టీసీ దృష్టిసారించాయి. ఈ మేరకు నగరంలో పలు అద్దె బస్సు సర్వీసులను నడిపిస్తోంది. వీటిని నిర్వహించేది ప్రైవేటు డ్రైవర్లే అయినందువల్ల అనుమతి ఇచ్చారు. అయితే కండక్టర్ లేకుండానే ఈ రెంట్ బస్సులు నడిపిస్తున్నాయి.సమ్మెతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు : సమ్మె కారణంగా బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది ర్యాపిడో, ఊబర్ లాంటి ప్రైవేటు సర్వీసుల ద్వారా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదనుగా ఆటో డ్రైవర్లు రేట్లు పెంచడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణికులకు సేవలందించాలని కోరుతున్నారు.అధికశాతం మందికి ప్రజా రవాణే ఆధారం : భాగ్యనగరంలో ఎంఎంటీఎస్ సర్వీసులతో నిత్యం 30 లక్షల మందికి పైగా ప్రయాణికులు ప్రజా రవాణా వ్యవస్థపై(ప్రభుత్వ)పై ఆధారపడి ఉండగా ఆర్టీసీలో 26 లక్షలు, ఎంఎంటీఎస్ 60 వేలు, మెట్రో 4.5 లక్షలు, లోకల్, ప్యాసింజర్ రైళ్లలో మిగిలినవారు నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. షేర్ ఆటో, క్యాబ్‌ల్లో ప్రయాణించేవారు మళ్లీ దీనికి అదనం. సమ్మె వల్ల బస్సులు పరిమితంగా నడుపుతుండటం వల్ల మిగిలిన విభాగాల్లో సర్వీసులను మరింత పెంచాల్సిన అవసరం అనివార్యంగా ఏర్పడింది. ఎంఎంటీఎస్ సర్వీసులు మరిన్ని పెంచినట్లయితే సబ్ అర్బన్ ప్రయాణాలు కొంత వరకు సాఫీగా సాగే అవకాశాలు ఉన్నాయి. మేడ్చల్, ఫలక్‌నుమా, చర్లపల్లి, నాంపల్లి, మల్కాజిగిరి, లింగంపల్లి మార్గాల్లో సర్వీసుల సంఖ్య పెంచితే అధికశాతం మంది ప్రజలు వినియోగించుకోవడానికి వీలు ఉంటుంది.

## కాళేశ్వరం దోషులు జైలుకు పోవడం ఖాయం

హైదరాబాద్: విధానపరమైన నిర్ణయాన్ని మాత్రమే తెలంగాణ హైకోర్టు తప్పుపట్టిందని, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ను హైకోర్టు తప్ప పట్టలేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. కమిషన్ నివేదిక, దర్యాప్తు తీరును కోర్టు తప్పు పట్టలేదన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందనేది వాస్తవం, రూ. లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిపోయిందనేది కూడా వాస్తవం అన్నారు.కాళేశ్వరం దోషులు ఎప్పటికైనా జైలుకు వెళ్లటం ఖాయమని హెచ్చరించారు. హైకోర్టు తీర్పును పరిశీలించి ప్రభుత్వం తదుపరి చర్చలకు వెళ్తోందని మహేశ్ గౌడ్ వివరించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని బీజేపీ నేతలు గతంలో అనలేదా?, కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ నేతకు ఏటీఎంగా మారిందని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అనలేదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం విచారణకు సీబీఐకి అప్పగిస్తే.. రెండ్రోజుల్లోనే దోషులను జైలులో పెడతామని కేంద్రమంత్రులు అన్నారని గుర్తుచేశారు. సీబీఐకి అప్పగిస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించిందని తెలిపారు.సీబీఐ దర్యాప్తు కోరితే ఇప్పటి వరకు కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోలేదు, బీఆర్ఎస్ తో బీజేపీకి ఉన్న లోపాయకారి ఒప్పందం వల్లే దర్యాప్తు ప్రారంభం కాలేదా? మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 ఏళ్ల క్రితం కట్టిన ప్రాజెక్టులు నిటారుగా నిలబడ్డాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టు మాత్రం మూడేళ్లకే కుంగిందని ఆరోపించారు. కమీషన్లకు ఆశపడి నాణ్యతలో రాజీ పడినందుకే మేడిగడ్డ కుంగి పోయిందన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కోరిన విధంగానే సీబీఐ దర్యాప్తునకు అప్పగించామని పేర్కొన్నారు. సీబీఐ దర్యాప్తు ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదో.. కిషన్ రెడ్డి, బండి సంజయ్ చెప్పాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.

## నల్లగొండ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో
# విజిలెన్స్ అధికారుల ఆకస్మిక సోదాలు



నల్లగొండ :నల్లగొండ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. విజిలెన్స్ సిఐ దశరథ మనోజ్ కుమార్ నేతృత్వంలో సోదాలు చేపట్టారు. ప్రభుత్వం నుండి, రిజిస్ట్రేషన్ శాఖ నుండి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా అనధికారికంగా విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు సిబ్బందిని విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఇద్దరు మహిళలు కాగా నలుగురు పురుషులు ఉన్నారు. వీరిని విజిలెన్స్ కార్యాలయానికి తరలించి వ్యక్తిగతంగా అందరిని వేర్వేరుగా విచారణ చేస్తున్నారు. ఎంతకాలం నుండి పని చేస్తున్నారు, ఎంత వేతనం పొందుతున్నారు, ఆ వేతనం ఎక్కడి నుండి వస్తుంది అనే విషయాలపై విచారణ చేపట్టారు. అంతేకాకుండా గత కొన్ని సంవత్సరాల నుండి చేసిన రిజిస్ట్రేషన్ లపై డాక్యుమెంట్ వారిగా రికార్డులను పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నర్సింహారెడ్డి, వెంకన్న, పాషా పాల్గొన్నారు.

# దేశ టైమ్స్ సంపాదకీయం

## ఇంగి తం మరచిపోయి తల్లితండ్రులను ఏ వృద్ధాశ్రమాల బయటో వదిలి వెళ్ళిపోతున్న ఉదంతాలు ఎన్నో వింటు న్నాము...

భక్తితో కానీ భయంతో గానీ తమ బిడ్డలు వార్ధక్యం లో తమను చూసుకుంటారని ఎదురు చూసే తల్లి దండ్రులకు ఇప్పుడు నిరాశే మిగులుతోంది. వారి జీవన పరిస్థితులు భయంకర స్వప్నంలా మిగిలిపోతున్నాయి. అవసాన దశ అతి దుర్భరంగా మారుతోంది. ఇదేదో 'తరం మార్పు' తకరారుగా సరిపెట్టుకోలేము. అడ్డాల నాడు బిడ్డలు కానీ గెడ్డాలొచ్చాక బిడ్డలా? అనే లోకోక్తి ఆధునిక కాలానికి తగినట్లుగానే ఉంది. కొడుకులు తన బాధ్యత కు వదులుకుని వెళ్ళిపోతున్నారు. సమాజనికి వెరవడం లేదు. ఎవరెలా పోతే నాకేం? అనే ధోరణికి మారిపోతున్నారు. మానవ సంబంధాలు మృగ్యమైపోతు న్నాయి. మళ్ళీ ఏదో ఒక నాటికి మనమూ వార్ధక్యాన్ని ఎదుర్కొంటామన్న ధ్యాసే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధాప్యాన్ని జయించడమెలాగో చెబుతూనే కేంద్ర ప్రభుత్వం వృద్ధుల కోసం 2007లో కొన్నిచట్టాలు చేసింది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఒక విన్నూత్నఆలోచనతో వృద్ధుల్ని రోడ్ మీద పడకుండా చేయగలిగే ఒక చట్టాన్ని ప్రతిపాదించడం విశేషం.మధ్యవయసులోనే తమకున్న ఆస్తుల్ని బిడ్డలకు బదిలీ చేసి వార్ధక్యం మీదపడి కాళ్లు లాగే సమయానికి చేయూతనిచ్చే కొడుకులు కనీస ఇంగి తం మరచిపోయి తల్లితండ్రులను ఏ వృద్ధాశ్రమాల బయటో వదిలి వెళ్ళిపోతున్న ఉ దంతాలు ఎన్నో వింటు న్నాము. ఇలాంటి తరుణంలో కనీసం కొందరు తల్లి తండ్రులకైనా ఈ చట్టం ఉపశమనం కలిగిస్తుంది. చట్టాలు చేయగానే సరికాదు. వాటిని అమలులో ఆచరణలో చిత్త శుద్ధితో వ్యవహరించగల యంత్రాంగాన్ని కూడా ఏర్పరచడం మేలు. అందులో భాగంగానే ప్రభుత్వం 'వృద్ధుల సంక్షేమ కమిషన్' ఏర్పాటు చేస్తోంది. కేవలం కుటుంబ విలువల పరిరక్షణకే ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు నిండు సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సగర్వంగా ప్రకటిం చారు. తల్లిదండ్రుల సంరక్షణకు ఒక మంత్రదండాన్ని ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి సభాముఖంగా స్పష్టం చేశారు. సంపాదన ఉన్నా లేకున్నా కలో గంజో తాగిన ప్రతివ్యక్తి తమ తల్లిదండ్రులను బాధ్యత గా చూసుకోవాలని ఆయన ఆకాంక్ష. ఇలాంటి బిల్లు ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం బహుశా ఇదేనేమో తల్లితండ్రుల సంరక్షణ, పోషణ, పర్యవేక్షణ బిల్లు పేరిట ఈ చట్టం రూపుదిద్దుకుంటోంది. సభా సదులంతా అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించారు.కేంద్ర ప్రభుత్వ చట్టాల మేరకు తల్లిదండ్రులకు రూ.10 వేలకు మించి ఇచ్చే అవకాశం లేదు. ఈ కారణంతో తెలంగాణలో మరికొన్ని అదనపు ప్రతిపాదనలు చేశారు. పదివేల రూపాయలు లేదా నెలవారీ వేతనం 15శాతం తల్లితండ్రుల పోషణార్థం ఇవ్వాలన్న షరతులు విధిం చారు. తల్లిదండ్రుల అవసరాలు చూడని వ్యక్తిని సామా జికంగా బహిష్కరించినప్పుడే సమాజంలో మార్పు తీసుకు రాగలమన్నది సభ ఏకాభిప్రాయం. ప్రైవేట్ ఉద్యోగులకు ప్రజ ప్రతినిధులకు కూడావర్తిస్తుంది. అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా వయోవృద్ధులకు ఆసరాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక చట్టం తీసుకు వచ్చింది. 'తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీ తనం, పర్యవేక్షణ చట్టం 2026'లో భాగంగా 'వయోవృద్ధుల కమిషన్'ను ప్రభుత్వం ఏర్పాటు చేయ నుంది. ఇందులో ఒక ప్రధాన కమిషనర్, ఇద్దరు కమిష నర్లు ఉంటారు. ఈమేరకు టీఈ ఏఎంపీఎస్ బిల్లు2026 ను శనివారం ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. తల్లితండ్రులను పట్టించుకోకుండా వదిలేసే ఉద్యోగుల వేతనాల నుంచి గరిష్టంగా రూ.10 వేల మేర కోత విధించి, తల్లిదండ్రుల పోషణ నిమిత్తం వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. తల్లిదండ్రుల యోగక్షేమాలను చూడడం, వారికి సేవలు చేయడం పిల్లల బాధ్యత అని, ఇది భార తీయ కుటుంబ వ్యవస్థలో ప్రధానమైన అంశమని ప్రభు త్వం పేర్కొంది. ప్రస్తుత ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బల హీనమైపోతోందని, పిల్లలు తమ తల్లిదండ్రులను పట్టించుకోకుండా నిరక్ష్యం చూపుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలోనే కుటుంబ విలువల సంరక్షణకు అవసరమైన ప్రమాణాలను రూపొందించాల్సిన ఆవశ్యకత ఏర్ప డింది. తల్లిదండ్రుల యోగక్షేమాలను నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగుల్లో నైతిక బాధ్యతను చట్టాన్ని తీసుకొస్తున్నట్లు స్పష్టం చేసింది.తల్లిదండ్రుల పోషణ కోసం ఉద్యోగి నెల వారి జీతం నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు ఏది తక్కువైతే దానిని మినహాయించి తల్లిదండ్రులకు చెల్లించే ఏర్పాట్లు చేయనున్న ప్రభుత్వ జవాబుదారీకిది నిదర్శనం. ఇది కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా ప్రభుత్వ రంగ కార్పొరేషన్లు, పంచాయతీరాజ్ చట్టం, మునిసిపల్ చట్టం కింద పని చేసే సిబ్బంది, ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బందికి కూడా వర్తి స్తుందని స్పష్టం చేసింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తేదీ నుంచి ఆరునెలల్లోపు ఆయా శాఖలు, సంస్థలుతమ ఉద్యోగులకు సంబంధించిన నియమాలను సవరించుకో వాలని సూచించింది. తమ బాగోగులను పట్టించుకోని పిల్లలపై తల్లిదండ్రులు ఇద్దరు గానీ ఒక్కరు గానీ వారి పిల్లలు పనిచేసే శాఖ విభాగాధిపతికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఆ అధికారి 60 రోజుల్లోగా ఫిర్యాదును పరి ష్కరించాలి. అక్కడ వరిష్కారం కాకపోతే తల్లిదండ్రులు 'వయోవృద్ధుల కమిషన్ను ఆశ్రయించాలి. ఆస్తిలో సమానవాటాదారుగా గుర్తింపబడిన కూతుర్ల బాధ్యతలు కూడా నిర్వచించడం అవసరం. ఏదిఏమైనా ప్రస్తుత సామాజిక కట్టుబాట్లు, వాటి ఉల్లంఘన వంటి విషయాల్లో తొలి అడుగులోనే కొడుకుల బాధ్యతను గుర్తింపచేయడం విశేషం. భక్తిలేని కన్నబిడ్డలకు భయం కలిగించినా, బాధ్యత నేర్పినా ముసలి తల్లిదండ్రులకిది శ్రీరామరక్షే.

## ఎస్బీఐలో మోసం.. నలుగురు అరెస్ట్




నల్లగొండ:దేవరకొండలోని స్టేట్ బ్యాం కు ఆఫ్ ఇండియాలోని అగ్రికల్చరల్ కమర్షియల్ బ్రాంచ్ (ఎసీబీ)లో జరిగిన భారీ కుంభకోణాన్ని నల్లగొండ జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన హౌస్ కీపింగ్ ఉద్యోగితో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. నిందితుల నుంచి రూ. 2,42,10,000 నగదు, 6 స్మార్ట్ ఫోన్లు, ఒక ల్యాప్ టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 13న తమ బ్యాంకు ద్వారా రూ. 2.65 కోట్లు నిధులను మళ్లించినట్లు దేవరకొండ ఎస్బీఐ ఏసీబీ బ్రాంచి మేనేజర్ ఫణీంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న హౌస్ కీపింగ్ ఉద్యోగి లెండల చక్రపాణి వాడ కంలో లేని ఖాతాల వివరాలను దుర్వినియోగం చేసి, ఈ నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్ కోఠి బ్రాంచ్‌కు చెందిన పల్లటి నరేందర్ అనే ఖాతాదారుని కేవైసీ వివరాలు అక్రమంగా అప్‌డేట్ అయినప్పుడు అతడికి ఈ-మెయిల్ అలర్ట్ రావడంతో ఈ మోసం బయటపడింది. ఈ కేసులో దేవరకొండ ఎస్బీఐలో హౌస్ కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న లెండల చక్రపాణి ప్రధాన నిందితుడు కాగా సూర్యాపేట ఎస్బీఐలో మేనేజర్‌గా పనిచేస్తున్న పుట్ట వెంకట రామాంజనేయులు, మిర్యాలగూడకు చెం దిన ఎస్బీఐ రికవరీ ఏజెంట్ కేతావత్ రాంలాల్, దేవరకొండకు చెందిన ఫొటోగ్రాఫర్ మారేపల్లి శివ మిగిలిన నిందితులు. ఐదేళ్లుగా బ్యాంకులో పనిచేస్తున్న చక్రపాణికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉండటంతో సిబ్బందికి సాయం చేస్తూ బ్యాంకు అంతర్గత వ్యవస్థపై అవగాహన పెంచు కున్నాడు. అప్పుల బాధ నుంచి గట్టెకేందుకు సూర్యాపేట బ్రాంచి మేనేజర్ రామాంజనేయులుతో చేతులు కలిపాడు. రామాంజనేయులు తనకున్న ఎంఐఎస్ యాక్సెస్‌తో ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న 10 ఖాతాల వివరాలు సేకరించాడు. కాగా ఆన్‌లైన్ సైట్ల ద్వారా నకిలీ ఆధార్, పాన్ కార్డులు సృష్టించారు. అయితే బ్యాంకు సిబ్బంది లాగిన్ వివరాలను దొంగతనంగా సేకరించి, రద్దీ సమయాల్లో ఖాతాలకు కొత్త మొబైల్ నంబర్లు అప్ డేట్ చేశారు. యోనో యాప్ ద్వారా కొత్త పిన్ నంబర్లు సృష్టించి నగదును ఇతర ఖాతాలకు బదిలీ చేశారు. రాంలాల్, శివ తమ పరిచయ స్తులకు కమీషన్ ఆశ చూపి వారి ఖాతాల ద్వారా నగదు డ్రా చేసినట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ రాజు తదితరులతో కూడిన బృందం సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## అదనపు లారీలు సమకూర్చాలి



నల్లగొండ: ధాన్యం కొనుగోళ్ళను యుద్ధ ప్రాతిపదికను చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు నల్లగొండలోని ఇందిరాభవన్ లో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో అశోక్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి యాసంగి వరి ధాన్యం సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు జరపాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైనన్ని లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా లైట్లు ఏర్పాటు చేసి, ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం ఎక్కువగా వచ్చే గ్రామాలను గుర్తించి, అక్కడ అదనపు లారీలను అందుబాటులో ఉంచాలని, రైతులు రోడ్లపై ధాన్యం పోయకుండా, అవసరమైతే పాఠశాలలు, ఫంక్షన్ హాళ్ల వద్ద కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో నిర్ణీత సమయంలో డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. నల్లగొండ నియోజకవర్గంలోనే సుమారు 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పలు అధికారులు పాల్గొన్నారు.

## సృజనాత్మకత వెలికి తీసేందుకే పోటీలు



తంగళ్లపల్లి, : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక వెలికితీతకే ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పోటీలు నిర్వహించినట్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా తంగళ్లపల్లి మం డలం బద్దనపల్లి టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పీఎంశ్రీ గురుకు ల పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, డిబేట్, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్యార్థుల పాటలు, నృత్యాలు, ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్ర మాన్ని ప్రారంభించారని తెలిపారు. జూన్ 12వ తేది వరకు 10 శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం రూప కల్పన చేసిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన పనులను వివరిస్తూ భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు కార్యక్రమం అమలు చేస్తోం దని వెల్లడించారు. ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేది వరకు సంక్షేమ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడిం చారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరుగురు ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు నిర్వహించా మని తెలిపారు. రోడ్లు భద్రత నియమా లు, ట్రాఫిక్ నిబంధనలు అమలు, గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామని, డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించామన్నారు. సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లా లోని అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో కిచెన్, స్కూల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిం చామని పేర్కొన్నారు. టాలెంట్ హంట్‌లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహిం చామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా పంచాయతీ అధికారి షరీఫొద్దీన్, గురకులాల డీసీవో థెరిస్సా, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎంపీడీవో లక్ష్మీ నారాయణ, సర్పంచ్ సిలివేరి లావణ్య చిరంజీవి, ప్రిన్సి పాల్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రహ్‌వీర్' ద్వారా రూ. 25వేల పారితోషికం

ఆసిఫాబాద్, : రోడ్డు ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను ప్రోత్సహించేం దుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రహ్‌వీర్ పథకం ద్వారా రూ. 25వేల నగదు పారితోషికంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తారని ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ దేశవ్యాప్తం గా ప్రతీ సంవ త్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరు గుతున్నాయని, ప్రమాదం జరిగిన తొలి గంటను గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారని పేర్కొన్నారు. ఈ సమయంలో బాధితులకు సమయా నికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని తెలిపారు. కానీ కొంతమంది పౌరులు పోలీసు కేసులు ఉండవచ్చనే భయంతో గాయపడిన వారికి సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారన్నారు. ఈ భయాలను తొలగిం చేందుకు కేంద్ర ప్రభుత్వం రహ్‌వీర్ పథకం అమలు చే స్తోందని పేర్కొన్నారు. ఈ పథకం ప్రకా రం రోడ్డు ప్రమాదం లో గాయపడిన వ్యక్తి ని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం రూ. 25వేల నగదు ప్రోత్సా హకంతో పాటు ప్రశంసాపత్రం అందజేస్తారని వివరించారు. సహాయం చేసిన వ్యక్తిపై ఎలాం టి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్సు సేవలకు సమాచారం ఇవ్వాలని సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించాలని సూచించా రు. ప్రతీపౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రా ణాలు కాపాడటంలో భాగస్వాములు కావాలని ఎస్పీ కోరారు.

## నామినేటెడ్ పోస్టుల్లో వడ్డెరలకు ప్రాధాన్యత

నల్లగొండ: నామినేటెడ్ పోస్టులలో వడ్డెరలకు తగిన ప్రాధాన్యత ఇస్తానని రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టానికి మారుపేరు వడ్డెరులు అన్నారు. చిన్న చిన్న కాంట్రాక్టు పనులతో పాటు నిరంతరం కష్టపడుతూ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి రావలసిన పెండింగ్ బిల్లు అన్నింటిని విడుదల చేశామన్నారు. వచ్చే నెలలో భర్తీ చేసే నామినేటెడ్ పోస్టులలో వడ్డెరులకు ప్రాధాన్యత కల్పిస్తామని, వడ్డెరలకు సంబంధించి ఏ సమస్య ఉన్న వారిని సీఎం దగ్గరికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు నల్గొండ జిల్లా కేంద్రంలో వడ్డరుల సంక్షేమ సంఘం భవనాన్ని పూర్తి చేయిస్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,జగద్గురు ఇమ్మడి సిద్ధ రామేశ్వర స్వామి,సభ అధ్యక్షులు అలకుంట్ల నాగరత్నం రాజు, రాష్ట్ర అధ్యక్షులు మంజుల రమేష్‌ఎంబీసీ చైర్మన్ జరిపేటి జైపాల్,స్త్రీ,శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ గోగుల సరిత, జిల్లా అధ్యక్షులు వేముల సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మోసగించడమే కేసీఆర్ నైజం

ఆమనగల్లు: నమ్మించి మోసగించడం కేసీఆర్ నైజమని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. రావణుడి చేతిలో విభీషణుడు భంగపడ్డట్లు కేసీఆర్ చేతిలో జీవన్‌రెడ్డి మోసపోవడం ఖాయం అని పేర్కొన్నారు. ఆమనగల్లులో మంగళవారం ఎంపీ రవి విలేకరులతో మాట్లాడుతూ... కేసీఆర్‌ను ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రజా ఎన్నికల్లో ఓడి అధికారానికి దూరమైన కేసీఆర్ ఫామ్‌హచి?సకే పరిమితమై విపక్షనేతగానూ విఫలమయ్యారని విమర్శించారు. ప్రతి ఎన్నికల్లోనూ బీఆర్ఎన్?ను ప్రజలు తిరస్కరిస్తున్నారని,వచ్చే ఎన్నికలే ఆ పార్టీకి చివరి ఎన్నికలని జ్యోష్యం చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని, ఓర్వలేక కేసీఆర్, ఆ పార్టీ నాయకులు విషం కక్కుతున్నారన్నారు. కేసీఆర్ ఎన్ని మాటలు మాట్లాడినా నష్టం లేదన్నారు. 42ఏళ్లు జీవన్‌రెడ్డి కాంగ్రెస్?లో అనేక పదవులు అనుభవించి పార్టీని వీడి కాంగ్రెన్ ను విమర్శించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. చెప్పినట్లు కాంగ్రెస్ వినలేదని పార్టీ వీడి 42ఏళ్ల వ్యక్తిగత ప్రతిష్టను జీవన్‌రెడ్డి దిగజార్చుకున్నారని అన్నారు. లెఫ్టిస్ట్ భావాలున్న జీవన్‌రెడ్డి వ్యక్తి పూజ, అధిపత్యం ఉండే బీఆర్ఎన్?లో చేరడం దురదృష్టకరం అన్నారు. జీవన్‌రెడ్డి కాంగ్రెస్ గురించి ఎన్నిసార్లు విమర్శిస్తే తయన తనకు తానే తిట్టుకున్నట్టన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్‌కు ప్రజలే కొండంత బలం అని ఎంపీ రవి ధీమా వ్యక్తం చేశారు.

# శోభన్ సోదరులకు మంచి టైమ్ వచ్చినట్టే



సంతోష్ శోభన్, సంగీత్ శోభన్. ఈ రెండు పేర్లు చూసి ఇండస్ట్రీలో వాళ్లే అప్పుడప్పుడూ కన్ఫ్యూజ్ అవుతూ ఉంటారు. మొన్న రాకాస ఈవెంట్ లో కొందరు హీరో పేరు చెప్పబోయి హీరో అన్నయని గుర్తు చేసుకోవడం ఫన్నీగా అనిపించింది. ఇదలా ఉంచితే శోభన్ బ్రదర్స్ కు మంచి టైం మొదలైనట్టుంది. ముందు సంతోష్ విషయానికి వస్తే చాలా సంవత్సరాలుగా హిట్టు కోసం ఎంత పరితపించిపోతున్నాడో చూస్తున్నాం. కుర్రాడిలో టాలెంట్ కు లోటు లేకపోయినా సక్సెస్ లేక వెనుకబడ్డాడు. ఫిబ్రవరిలో విడుదలైన కపుల్ ఫ్రెండ్లీ సంతోష్ కు మంచి బ్రేక్ ఇచ్చింది. అదిరిపోయే బ్లాక్ బస్టర్ అనలేం కానీ ఉన్నంతగా నెగటివ్ అనిపించుకోకుండా ఏ సెంటర్స్ వసూళ్లతో డీసెంట్ గా గట్టెక్కింది. తన మీద పెట్టుబడి పెట్టొచ్చనే నమ్మకాన్ని నిర్మాతలకు కలిగించింది. అంతకు ముందు అన్నీ మంచి శకునములే, ప్రేమ్ కుమార్, శ్రీదేవి శోభన్ బాబు, కళ్యాణం కమనీయం, లైక్ షేర్ సబ్స్క్రైబ్ రూపంలో సంతోష్ శోభన్ చేసినవి కలలో కూడా మర్చిపోలేని అల్ట్రా ఫ్లాపులు. ఇక సంగీత్ శోభన్ విషయానికి వస్తే ఇప్పుడిప్పుడే కెరీర్ ని చక్కదిద్దుకుంటున్నాడు. మ్యాడ్ తో వచ్చిన పేరు మ్యాడ్ స్క్వేర్ తో నిలబడిపోగా దాన్ని మరింత పెంచుకునే ప్రయత్నంలో కథ ఎంపిక గురించి జాగ్రత్తగా ఉంటున్నాడు. కామెడీ టైమింగ్ తో ఆకట్టుకునే సంగీత్ టాలీవుడ్ మిస్సవుతున్న కామెడీ మూవీస్ కి మంచి ఆప్షన్ అయ్యేలా ఉన్నాడు. అల్లరి నరేష్ దూకుడు ఇప్పుడు లేదు కాబట్టి ఆ స్థానాన్ని అందిపుచ్చుకోవడానికి సంగీత్ కు బోలెడు అవకాశాలు వస్తాయ్. తాజాగా రాకాస బాక్సాఫీస్ వద్ద బాగానే పెర్ఫార్మ్ చేస్తోంది. పూర్తిగా కొత్త కథ కాకపోయినా, కొన్ని లాజిక్స్ లేకపోయినా బోర్ కొట్టలేదన్న తరహాలో ఫీడ్ బ్యాక్ రావడంతో మాస్ ప్రేక్షకుల సపోర్ట్ రాకాసకే కనిపిస్తోంది. బైకర్ ఎమోషనల్ డ్రామా కావడంతో దానికి వెళ్లే ఆడియన్స్ వేరుగా ఉంటున్నారు. ఇకపై సంతోష్, శోభన్ తాము చేయబోయే సినిమాల పట్ల ఇంకాస్త కేర్ తీసుకోవాలి. వీళ్ళ తండ్రి శోభన్ ప్రభాస్ వర్షం, రవితేజ చంటి లాంటి సినిమాలు డైరెక్ట్ చేసి చిన్న వయసులోనే చనిపోయిన సంగతి తెలిసిందే.

# సమయం మించిపోతోంది స్వయంభు



ఒళ్ళు హూనం చేసుకుని సంవత్సరాలు ఖర్చు పెట్టి నిఖిల్ నటించిన ప్యాన్ ఇండియా మూవీ స్వయంభు. ఇప్పటిదాకా కొత్త రిలీజ్ డేట్ ప్రకటించలేదు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ అన్నారు. కానీ ప్రమోషన్ల జాడ లేదు. ఒకవేళ పెద్ది కనక ఏప్రిల్ 30 తప్పుకుంటే ఆ స్లాట్ లో వద్దామనే ఆలోచనలో టీమ్ ఉంది కానీ నిజంగా రామ్ చరణ్ వస్తాడా రాడానే అయోమయం కొనసాగుతూనే ఉంది. అసలు పెద్దిని బేస్ చేసుకుని స్వయంభు వెయిటింగ్ గేమ్ ఆడటం ఎంత మాత్రం సేఫ్ కాదు. ఎందుకంటే నిఖిల్ చేసింది ఏదో ఆషామాషీ చిన్న సినిమా కాదు. కార్తికేయ 2 లాగా అన్ని భాషల్లో రీచ్ అయ్యేందుకు స్కోప్ ఉన్న కంటెంట్. బడ్జెట్ మంచి నీళ్లలా ఖర్చు పెట్టారు . టీజర్ చూసి ఫ్యాన్స్ ఆశ్చర్యపోయారు. కొన్ని వర్గాల నుంచి మిశ్రమ స్పందన కూడా లేకపోలేదు. అయితే స్వయంభుకి బజ్ పెంచాల్సిన బాధ్యత టీమ్ మీద ఉంది. ఎందుకంటే నిఖిల్ ఇమేజ్, మార్కెట్ ని మించిన సబ్జెక్టు ఇది. ప్రభాస్ కటవుట్ స్థాయిలో రాసుకున్నాడు దర్శకుడు భరత్ కృష్ణమాచార్య. సో దానికి న్యాయం జరగాలంటే ఏదో ఒక రూపంలో స్వయంభు సౌండ్ వినిపిస్తూ ఉండాలి. షూటింగ్ ఆల్రెడీ అయిపోయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. దీని కన్నా ఆలస్యంగా వచ్చే నాగబంధం ఆల్రెడీ మే నెలలో డేట్ వేసుకుని దానికి తగ్గ పబ్లిసిటీ ప్లాన్ తో ఉంది. మరి నిఖిల్ బృందం మౌనం వెనుక స్ట్రాటజీ ఏంటో ఫ్యాన్స్ కి అర్థం కావడం లేదు. రవి బస్రూర్ సంగీతం సమకూరుస్తున్న ఈ ఎపిక్ డ్రామాలో సంయుక్త మీనన్, నభ నటేష్ హీరోయిన్లుగా నటించారు. ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే పెద్ది ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ముందైతే స్వయంభు ఏదో ఒక తేదీ మీద అనౌన్స్ మెంట్ ఇచ్చుకోవడం బెటర్. ఎందుకంటే హిందీ, తమిళ, మలయాళ భాషల్లో కూడా రిలీజ్ ఉంది కాబట్టి అక్కడ ఎలాంటి పోటీ ఉందో చెక్ చేసుకుని మరీ ఫిక్స్ అవ్వాల్సి ఉంటుంది. దీని మీదే నిర్మాతలు మల్లగుల్లాలు పడుతున్నారట. ఓటిటి డీల్ గురించి కూడా సరైన క్లారిటీ లేదు. నిఖిల్ మాత్రం స్వయంభు మీద టన్నుల్లో ఆశలు పెట్టుకున్నాడు.

# సంక్షేమ వారోత్సవాలు జయప్రదం చేయాలి

గద్వాల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలను అధికారులు జయప్రదం చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప ణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలపై కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ వసతిగృహంతో పాటు కస్తూర్బా పాఠశాలలు, గురుకు ల విద్యాలయాల్లో మండల, జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయా రోజుల్లో నిర్వహించే కార్యక్రమాలను సజావుగా నిర్వహించి పెద్దఎత్తున ప్రచారం కల్పించాలన్నా రు. సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఈవారోత్సవాల సందర్భంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈనెల 22న ఆయా వసతిగృహాలు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాల్లో చిన్నపాటి మరమ్మతులు ఉంటే గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక ఇవ్వాలని చెప్పారు. 23న పేరెంట్స్ మీటింగ్, 24న విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధిపై, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 25న సమ్మర్ క్యాంప్లో విద్యార్థులకు ఇచ్చే శిక్షణపై అవగాహన కలిగించాలన్నారు. చివరి రోజు 26న బడిబాట కార్యక్ర మాన్ని నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సిం గ రావు, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి నుషిత, బీసీ సంక్షేమాధికారి అక్బర్బా షా, డీఈవో విజయలక్ష్మి, ఇతర అధికారులు ఉన్నారు.

# ఉగ్రవాదానికి భారత్ ఎప్పటికీ తలొగ్గదు



న్యూఢిల్లీ:ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సరే భారత్ దానికి ఎప్పటికీ తలొగ్గదని, వారి కుట్రలు ఎప్పటికీ సఫలం కావని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి సరిగ్గా ఏడాది పూర్తైన సందర్భంగా బుధవారం ఆ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులను ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. ఈ మేరకు మోదీ ఎక్స్ లో పోస్ట్ చేశారు. మరోవైపు, పహల్గాం ఉగ్రదాడికి ఏడాది పూరైన సందర్భంగా రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు నివాళులు అర్పించారు. “2025 ఏప్రిల్ 22న జమ్ము కశ్మీర్లోని పహల్గాంలో పర్యటకులపై పిరికిపంద ఉగ్రదాడి జరిగింది. ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలను స్మరించుకుంటూ, వారికి నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. అలాగే, మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతున్నాను. మన దేశంపై పడిన ఆ గాయాలను మేం ఎప్పటికీ మరచిపోలేం. దశాబ్ద కాలంగా భారత్ సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కొంది. కానీ మన ప్రజలకు హాని కలిగించడానికి కానీ, లేదా మన ఐక్యతను దెబ్బతీయడానికి కానీ చేసే ఏ ప్రయత్నాన్నైనా మనం అత్యంత బలంతో, స్పష్టతతో ఎదుర్కొంటామని దృఢమైన చర్యల ద్వారా మేం నిరూపించాం.” అని రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, దేశానికి వ్యతిరేకంగా జరిగే ఎలాంటి చర్యలకైనా గట్టి బదులిస్తామని భారత సైన్యం హెచ్చరించింది. ఉగ్రవాదులు సరిహద్దులు దాటవద్దని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ను గుర్తుచేసుకుంటూ భారత్ సైన్యం ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేసింది. గత ఏడాది సరిగ్గా ఇదే రోజున జమ్ము కశ్మీర్ పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యటకులపై ఉగ్రవాదులు ఒక్కసారిగా తుపాకులతో విరుచుకుపడ్డారు. ఆ దాడిలో దాదాపు 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో భారతావని భగ్గుమంది. ప్రతీకారం తీర్చుకోవాలని 2025 మే 7న ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై వైమానిక దాడులు నిర్వహించింది. ఈ ఆపరేషన్ లో లష్కర్ ఏ తొయ్యిబా, జైషే మహ్మద్ , హిజ్బుల్ ముజాహిదీన్ లకు చెందిన 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. అలాగే, 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. అనంతరం దాయాది దేశం డ్రోన్ , షెల్లింగ్ దాడులు జరపడంతో ఇరుదేశాల మధ్య నాలుగు రోజుల పాటు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ దాడుల్లో పాక్ లోని రాడార్ వ్యవస్థలు నాశనమయ్యాయి. అలాగే, సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. అయితే, పాక్ కు భారీ నష్టం వాటిల్లడంతో పాకిస్థాన్ మిలిటర్ జనరల్ భారత్ ను సంప్రదించారు. దీంతో మే 10 న కాల్పుల విరమణ జరిగింది. అనంతరం, అదే ఏడాది ‘ఆపరేషన్ మహదేవ్ ’ పేరుతో భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ లో, పహల్గాం దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదులను హతమయ్యారు.

# చమురు సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి భారత్ మాస్టర్ ప్లాన్!



న్యూఢిల్లీ: అమెరికా– ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణం, స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ వద్ద నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ సరఫరాపై ఆందోళనలు మొదలయ్యాయి. ఇలాంటి సమయంలో చమురు కొరత ఏర్పడకుండా భారతదేశం ఒక తెలివైన నిర్ణయం తీసుకుంది. రష్యన్ చమురును తీసుకువచ్చే ఓడలకు బీమా కల్పించే రష్యన్ కంపెనీల సంఖ్యను పెంచాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో 8 కంపెనీలకు మాత్రమే అనుమతి ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్యను 11కి పెంచారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కంపెనీలు ఓడలకు P&I అనే ప్రత్యేక రకమైన బీమాను అందిస్తాయి. అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో ఓడలు ప్రయాణించడానికి ఈ బీమా అత్యంత కీలకం. నిజానికి రష్యాపై పాశ్చాత్య దేశాల ఆంక్షల కారణంగా ఐరోపాకు చెందిన పెద్ద బీమా కంపెనీలు రష్యన్ చమురును మోసే ఓడలకు బీమా ఇవ్వడం తగ్గించాయి. రష్యా నుండి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్న భారత్కు ఇది పెద్ద సమస్యగా మారింది. ఇప్పుడు రష్యన్ బీమా కంపెనీలకే అనుమతి ఇవ్వడం ద్వారా భారత్ ఈ సమస్యకు పరిష్కారం కనుగొంది. ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ కంపెనీలైన గజ్ప్రోమ్ ఇన్సూరెన్స్, రోస్గోస్ట్రాఖ్లకు ఫిబ్రవరి 2027 వరకు పని చేయడానికి అనుమతి లభించింది. అదేవిధంగా యూఖ, సోగాజ్, ఆల్ఫాస్ట్రాఖోవాని కంపెనీలకు 2030 వరకు అనుమతి ఇచ్చారు. దీన్ని బట్టి భారత్ కేవలం ప్రస్తుత అవసరాల కోసమే కాకుండా రాబోయే ఐదారు ఏళ్ల భవిష్యత్తు కోసం ముందస్తు ప్రణాళికతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. వీటితో పాటు దుబాయ్కు చెందిన ఇస్లామిక్ ప్రొటెక్షన్ అండ్ ఇండెమ్నిటీ క్లబ్ కంపెనీకి కూడా ఫిబ్రవరి 2027 వరకు సేవలు అందించడానికి అనుమతి ఇచ్చారు. దీనివల్ల ఒకే కంపెనీపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు గరిష్ట స్థాయికి చేరిన సమయంలో భారత్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ప్రపంచ చమురు రవాణాలో ఈ మార్గం అత్యంత కీలకమైనది. ఇక్కడ ఏదైనా అడ్డంకి ఏర్పడితే భారత్ వంటి దేశాలపై నేరుగా ప్రభావం పడుతుంది. ప్రపంచంలోనే చమురును దిగుమతి చేసుకునే మూడవ అతిపెద్ద దేశమైన భారత్.. ఇటీవలి కాలంలో రష్యా నుండి తక్కువ ధరకే చమురు కొనుగోలును పెంచింది. ఈ క్రమంలో చమురు రవాణాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవడం భారత్కు చాలా అవసరం. భారత్ తీసుకున్న ఈ నిర్ణయం ఒక ‘రక్షణ కవచం’లా పనిచేస్తుంది. దీనివల్ల దేశ ఇంధన అవసరాలకు ఎలాంటి అంతరాయం కలగదు.

# మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించాలి



ఉప్పునుంతల:మండల పరిధిలోని దేవదారికుంట తండాలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ క్రమంలో కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోళ్లలో ఎటువంటి ఆలస్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.2400 మద్దతు ధర రైతులకు పూర్తిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంట తేమ శాతం 14% లోపు ఉండేలా రైతులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. తేమ అధికంగా ఉంటే ధర తగ్గే అవకాశం ఉన్నందున నాణ్యతపై శ్రద్ధ పెట్టాలని చెప్పారు. కేంద్రంలో తూకం, నిల్వ, రవాణా సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని, రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ సైదులు, పీఏసీఎస్ సీఈఓ కొమ్ము ఎల్లయ్య, ఆర్ఐ బలరాం, శివ, పీఏసీఎస్ మల్లేష్, రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలు మహిళ అభివృద్ధిని అడ్డుకున్నాయి

మహబూబ్ నగర్, : ప్రతిపక్షాలు మహిళా అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఎంపీ డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. మహిళా రిజర్వేషన్, డిలిమిటేషన్, సీట్ల పెంపుపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎలాగైనా మహిళలు ఇదిగో కూడదు అనే సంకల్పంతో ప్రతిపక్ష పార్టీల నేతలు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 2029లో మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ అందించాలనే ఉద్దేశంతో బిల్లు ప్రవేశపెడితే.. కాంగ్రెస్,దాని మిత్ర పక్షాలు వ్యతిరేకించేయని పేర్కొన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ మహిళ రిజర్వేషన్ బిల్లు అడ్డుకుంటూనే వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల వేళ మహిళా రిజర్వేషన్ గురించి మాట్లాడటం.. తర్వాత తూట్లు పొడవటం అనాదిగా కొనసాగిస్తుందన్నారు. మహిళ రిజర్వేషన్ అమలుకు టీఎంసీ, డీఎంకే, ఎస్ పీ, కాంగ్రెస్ కుంటి సాకులు చెబుతూ వ్యతిరేకిస్తున్నారన్నారు. ఏ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా.. భేదాభిప్రాయం లేకుండా 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదన చేశారన్నారు. 17 స్థానాలు ఉన్న తెలంగాణలో 9 స్థానాలు పెంచితే.. 26 స్థానాలకు పెరిగేవన్నారు. కేంద్రం సమతుల్యమైన ఫార్ములా తీసుకువస్తే.. దేశాన్ని విభజించే తీరుగా దక్షిణ భారతదేశం, ఉత్తర భారతదేశం అనే భావన ఇండి కూటమి పార్టీలు తీసుకువచ్చారన్నారు. ఈ బిల్లుకు 2/3 మద్దతు కోసం అన్ని పార్టీల మద్దతు పార్లమెంట్ వేదికగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరారన్నారు. ఏప్రిల్ 24వ తేదీన ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ ముగింపు వేడుక కు గాను మహబూబ్ నగర్ కు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విచ్చేస్తున్నారన్నారు. మహిళా బిల్లు వేగిపోతే ప్రతిపక్షాలు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని, మహిళకు సముచిత గౌరవం ప్రాథమిక ఇవ్వవలసిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచి వారి సంక్షేమం కోసం పరితపిస్తున్నారని విమర్శించారు. చేయాల్సిన పనులను కూడా పెండింగ్లో పెడుతూ అభివృద్ధిని పూర్తిగా అడ్డుకొని ఇతరులపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం ఉన్నారు. ప్రజలకు మంచి చేసినప్పుడే ఆ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు అచ్చుగట్ల అంజయ్య , కిరణ్ కుమార్ రెడ్డి , బొక్క బాల్ రెడ్డి , కృష్ణవర్ధన్ రెడ్డి ,పడకుల సత్యం,మర్రి జ్యోతి ,హరికృష్ణ, కరుణాకర్ రెడ్డి,పద్మావేణి,శివారెడ్డి ,శ్రీశైలం,వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడికి నిప్పంటించి చంపిన యువతి

బెంగళూరు, : పెండ్లి చేసుకోడన్నఅనుమానంతో కర్ణాటకలోని బెంగళూరులో ఒక యువతి పట్టపగలు ప్రియుడిపై ఘాతుకానికి దిగింది. ప్రేమ ప్రపోజల్ పేరుతో ప్రియుడి కండ్లకు గంతలు కట్టి, కుర్చీకి కట్టేసి అతడికి నిప్పంటించి హతమార్చింది. బెంగళూరులోని ఒక టెలికం స్టోర్లో పనిచేసే కిరణ్, ప్రేరణ ప్రేమించుకుంటున్నారు. వారిద్దరి వయసూ 27 ఏండ్లే. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అంజన్పురలోని తన ఇంటికి రావాలని కిరణ్ను ప్రేరణ ఆహ్వానించింది. కిరణ్ ఆమె ఇంటికి వెళ్లిన తర్వాత కాసేపు మాట్లాడుకున్నారు. అనంతరం ఆమె కిరణ్ కండ్లకు గంతలు కట్టడమే కాక, అతడిని కుర్చీకి కట్టేసింది. ఇదేంటని అభ్యంతరం చెబుతూ ప్రశ్నించిన అతడికి ఇదో కొత్తరకం ప్రపోజల్ అని, విదేశాల్లో అలాగే చెబుతారని అనడంతో నిజమే అనుకున్నాడు. వెరైటీగా చేస్తున్న ఆమె ప్రపోజల్ కోసం కిరణ్ చూస్తుండగా, అతని ఒంటిపై ముందుగానే సిద్ధం చేసుకున్న మండే స్వభావం కల ద్రవాన్ని చల్లిన ఆమె తర్వాత అతని ఒంటికి నిప్పంటించింది. ఏం జరిగిందో తెలిసేలోగా మంటల్లో కిరణ్ ఆహుతై మరణించాడు. బాధతో అతను కేకలు వేస్తున్నా ఏమాత్రం చలించని ఆమె ఆ దృశ్యాన్ని తాపీగా సెల్ఫోన్లో రికార్డు చేసింది. కిరణ్ పెడుతున్న అరుపులు విని చుట్టుపక్కల వారు ఆ ఇంట్లోకి వచ్చి కుర్చీలో విగతజీవిగా పడి ఉన్న కిరణ్ని చూసి షాకయ్యారు. మొదట అదేమన్నా ప్రమాదమేమోనని వారు భావించారు. అయితే అతడిని తానే హత్య చేసినట్టు ప్రేరణ నిర్భయంగా చెప్పింది. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగప్రవేశం చేసిన పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి కిరణ్ను ఎందుకు చంపావని ప్రశ్నించగా, ‘సంవత్సరం నుంచి మేం రిలేషన్లో ఉన్నాం.. అతను ఈ మధ్య నన్ను సరిగ్గా పట్టించుకోవడం లేదు. నన్ను పెండి ?లచేసుకోడని అనుమానం వచ్చింది. అందుకే నిప్పు పెట్టి చంపేశా’ అని తాపీగా చెప్పడంతో విస్తుపోవడం పోలీసుల వంతయ్యింది. ఇంట్లో తల్లి, సోదరుడితో ప్రేరణ ఉంటున్నదని, ఘటన జరిగినప్పుడు వారు ఇంట్లో లేరని డిప్యూటీ పోలీస్ కమిషనర్ డీఎల్ నగేశ్ తెలిపారు.

# హాష్ ఆయిల్ స్మగ్లింగ్ అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



వరంగల్ :వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో తొలిసారిగా భారీస్థాయిలో హాష్ ఆయిల్ (గంజాయి మొక్కల నుంచి తీసిన నూనె) సరఫరా చేస్తున్న ముఠాలోని నలుగురు సభ్యులను వరంగల్ డ్రగ్ కంట్రోల్, క్యాట్ పార్టీ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ. 2.50 కోట్ల హాష్ ఆయిల్‌తోపాటు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హన్మకొండలోని పోలీసు కమిషనరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ వివరాలు వెల్లడించారు.అరెస్టు అయిన వారిలో ఒడిషా మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ మండలం సువ్వపల్లికి చెందిన హంటల్ సన్ను, హంటల్ సన్యాసి, రేకపల్లికి చెందిన కృష్ణా హంటల్, ఆంధ్రప్రదేశ్ అల్లూరి జిల్లా గూడెం మండలం దారకొండ గ్రామానికి చెందిన కండెల చిన్నబాబు ఉన్నారు. మరో నిందితుడు కిలో పాండి పరారీలో వున్నాడు. నిందితులందరూ పరిచయస్తులు కాగా, ప్రధాన నిందితుడు హంటల్ సన్ను స్వగ్రామంలో గంజాయి మొక్కలను పెంచుతూ వాటిని మిగతా నిందితుల ద్వారా విక్రయించి సొమ్ము చేసుకొని జల్సాలు చేసేవాడు. ఆ తర్వాత పరారీలో ఉన్న కిలో పాండు సూచనల మేరకు ముఠా సభ్యులంతా గంజాయి మొక్కలు పెంచి.. 40 కిలోల హాష్ ఆయిల్‌ను సేకరించారు. 20 కిలోల ఆయిల్‌ను కిలో చొప్పున ప్యాకెట్లలో ప్యాక్ చేశారు. ముంబయిలో విక్రయించేందుకు ఆంధ్రప్రదేశ్ తుని రైల్వే స్టేషన్ నుంచి ఈనెల 19వ తేదీ అర్ధరాత్రి కోణార్క్ రైలులో బయలుదేరారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో సోమవారం దిగిన నిందితులు ఉదయం ముంబయి వెళ్లేందుకు వరంగల్ బస్టాండ్ వద్ద వున్న రైల్వే గూడ్స్ షెడ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరగడంతో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకొని తనిఖీలు చేశారు. వారిని అరెస్టు చేసి.. 20 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, వరంగల్ ఏఎస్పీ శుభం, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, జానీ నర్సింహులు, డ్రగ్ కంట్రోల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ వై.నతీష్, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షూకూర్, ఎస్ఐలు సందీప్, తేజ, ఆర్ఎస్ఐలు ఎ.పూర్ణచందర్ రెడ్డి, కె.మనోజ్‌రెడ్డి, ఎల్.లింగారావు, క్యాట్ పార్టీ ఎఆర్ఎస్ఐలు వి.సుబ్బరామిరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు బాలరాజు, కె.శ్రీరాములు, ఎండి రబ్బాని, ఆర్.రాజ్‌కుమార్‌తోపాటు ఇంతేజార్‌గంజ్ ఇబ్బందిని కమిషనర్ అభినందించారు.

## శిలను శిల్పం చేసే శక్తి ఉపాధ్యాయులకే సాధ్యం

మహబూబ్ నగర్, : శిలను శిల్పాను చేసే శక్తి ఉపాధ్యాయులకు ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఐడిఓసిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో సుమారు 19,775 మంది విద్యార్థులు, మొత్తం 192 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, డ్రాప్స్ ఔట్ లను తగ్గించి ఎన్రోల్మెంట్ పెంచాలన్నారు.విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రావీణ్యంతో తీర్చిదిద్దేందాలని,భవిష్యత్తులో యంత్రాల ప్రాధాన్యం పెరుగుతుందని, విద్యార్థుల్లో మానసిక స్థైర్యం అవసరమన్నారు. అపజయాల సమయంలో విద్యార్థులకు అండగా నిలవాలని,సోషల్ బిహేవియర్, కుటుంబ విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. శారీరక శిక్షలు కాకుండా మార్గదర్శకంతో విద్యార్థులను సరిదిద్దాలని, టీచర్ తలిస్తే రాయిని కూడా వజ్రంగా మార్చగలరని పేర్కొన్నారు.డిజిటల్ బోర్డులు, డిజిటల్ పాఠ్యపుస్తకాలతో ఫలితాల్లో గణనీయమైన మెరుగుదల కావడం జరిగిందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత శాతం 50% నుంచి 94% వరకు పెరిగినట్లు వెల్లడించారు. శతశాతం కార్యక్రమాన్ని 8, 9 తరగతులకు విస్తరించాలని, ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరాల కోసం ప్రత్యేక ఫారమ్, నిధుల సమీకరణ బాధ్యత తనదేనని,ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ట్రిపుల్ ఐటీ సాధన కోసం ఏర్పాటు చేసిన శిక్షణకు ఉదయం 5 గంటల నుంచే బోధన, ఉపాధ్యాయుల నిబద్ధతకు నిదర్శనం అన్నారు. గవర్నమెంట్ బాలికల జూనియర్ కాలేజీలో 992 మార్కులు ప్రభుత్వ లెక్చరర్ల కృషి ఫలితగానే సాధ్యం కావడం జరిగిందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ప్రతి ఒక్కరు నిబద్ధత తో తమ విధులను నిర్వహించి మంచి విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, జగపతి రావు, ఫరూక్ హుస్సేన్, వెంకట నర్సయ్య, మహబూబ్నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ల పంపిణీపై మరో కీలక నిర్ణయం



హైదరాబాద్: తెలంగాణలో పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అన్ని పట్టణాలు, నగరాల్లో పింఛన్ల పంపిణీకి సంబంధించిన రూల్స్ మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ఫేషియల్ రికగ్నేషన్ (ముఖ ఆధారిత గుర్తింపు) విధానంలో పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రజాభవన్‌లో మున్సిపల్‌శాఖ అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి ఫేషియల్ రికగ్నిషన్ విధానంపై జిల్లా సమన్వయకర్తలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, వార్డు అధికారులకు శిక్షణ ఇచ్చారు.ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ముఖగుర్తింపుతో పెన్షన్లు ఇస్తున్నామని మెప్మా (పట్టణ ప్రాంతాల పేదరిక నిర్మూలన సంస్థ) సీఈవో దివ్యాదేవరాజన్ గుర్తు చేశారు. ఇకపై నగరాలు, పట్టణ ప్రాంతాల్లోనూ త్వరలో ఫేస్ రికగ్నేషన్ విధానాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కొత్త విధానంతో.. ఒకవేళ ఎవరైనా అనర్హులు, చనిపోయిన వారి పేర్లు ఉంటే.. వాటిని తొలగించి అర్హులకే పింఛన్లు అందజేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన అధికారులు వారి, వారి జిల్లాలలో అక్కడి సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం ఈ కొత్త విధానాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో సమస్యలకు చెక్ పెట్టేందుకు కొత్త విధానాన్ని తీసుకొచ్చింది.వృద్ధుల వేలిముద్రలు ఫింగర్ ప్రింట్ స్కానర్‌లు గుర్తించకపోవడంతో పాటుగా చాలా చోట్ల చనిపోయిన లబ్ధిదారుల పేర్లను తొలగించకుండా పింఛన్ డబ్బుల్ని స్వాహా చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. అలాగే చాలామంది ఈ సమస్యల కారణంగా పింఛన్లు తీసుకోవడం లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం సమస్యలకు పరిష్కారంగా ఫేస్ రికగ్నేషన్ ఆధారిత పింఛను పంపిణీని గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తోంది. ఈ కొత్త విధానంతో పింఛన్ పంపిణీ సమయంలో వేలిముద్రతో పనిలేకుండా పోయింది. లబ్ధిదారులు కూడా యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పింఛన్లు తీసుకుంటున్నారు.ఒకవేళ ఎవరైనా పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుడు చనిపోయినా, వలస వెళ్లినా ఈ ఫేస్ రికగ్నేషన్ విధానంలో తెలిసిపోతుంది అంటున్నారు. అలాగే పింఛన్లు పక్కదారి పట్టే అవకాశం ఉండదంటున్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.. ఇప్పుడు నగర, పట్టణ ప్రాంతాల్లో కూడా అమలు చేయనున్నారు. పింఛన్ తీసుకునే వ్యక్తి చనిపోతే.. వారి స్థానంలో వారి భార్యలకు పింఛన్‌కు అవకాశం కల్పిస్తున్నారు. ఊరు వదిలి వలస వెళ్లిన వారిలో ఎవరైనా మూడు నెలలుగా పింఛను తీసుకోని వారు ఉంటే గుర్తించడం, అలాగే చనిపోయిన లబ్ధిదారుల పేర్లు తొలగించడం, సాంకేతిక కారణాలతో ఆగిపోయిన పింఛన్‌లకు సంబంధించిన సమ్యల్ని పరిష్కరించడం ఇలా అన్ని సమస్యలకు చెక్ పెట్టేలా నిర్ణయం తీసుకున్నారు.

# మంచి చేయాలని సంకల్పం మనసులో ఉండాలి



మహబూబ్ నగర్,: మంచి చేయాలని సంకల్పం మనసులో ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో56 సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యశాఖ చికిత్సలు పొందిన నిరుపేదలకు సైతం సహకారం అందించాలని సంకల్పంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితి రూ 5 లక్షల నుంచి రూ 10 లక్షలకు పెంచడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోగ్యం బాగుంటేనే ప్రతి వ్యక్తి జీవితం అద్భుతంగా ఉంటుందని, ప్రతి ఒక్కరు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు అవసరమైన సమయాన్ని కూడా కేటాయించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే ఆదాయం కూడా తగ్గడంతోపాటు జీవన ప్రమాణాలలో విపరీతమైన భేదాలు వస్తాయని పేర్కొన్నారు.బాధ్యతగా ఉంటూ అవసరమైన సూచనలు సలహాలు తోటి వారికి చెప్పుకుంటూ అద్భుతమైన జీవితం గడిపేందుకు ప్రతి ఒక్కరు అడుగులు ముందుకు వేయాలని సూచించారు. కష్టపడ్డప్పుడే ఫలితం దక్కుతుందని ఆశించిన మేరకు కష్టపడకుండా అత్యాశ పడితే ఎప్పటికీ వారి నిర్దేశించుకున్న లక్ష్యం ఎప్పటికీ నెరవేరదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంతో గొప్ప లక్ష్యంతో ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకొని ముందుకు తీసుకుపోతున్నారని తెలిపారు.

## వ్యవసాయరంగ బలోపేతానికి ప్రభుత్వం కృషి

స్టేషన్ ఘనపూర్, : వ్యవసాయ రంగ బలోపేతం, రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లిలో డీసీసీబీ ఏర్పాటుచేసిన నూతన బ్యాంకు శాఖను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రైతులు, మహిళలకు ఆర్థికంగా బలంగా నిలబడేందుకు ఇటువంటి బ్యాంకింగ్ సేవలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. రఘునాథపల్లిలో బ్యాంకు బ్రాంచ్ ప్రారంభం కావడం సంతోషకరమని, స్థానికులకు ఇది మరింత ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వ్యవసాయ భూమిని ఆధారంగా చేసుకుని విద్యారుణాలు అందించడం అభినందనీయమని ఎంపీ అన్నారు.బంగారు రుణాల రూపంలో ఇప్పటికే రూ. 541 కోట్ల వరకు సహాయం అందించడాన్ని ప్రస్తావిస్తూ, సహకార బ్యాంకులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తున్నాయని చెప్పారు. బ్యాంకు సేవలను రైతులు, మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత పురోగతి సాధించాలని కోరారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.వరంగల్ డీసీసీబీ ఆర్థిక పరిపుష్టి కలిగిన సంస్థగా ప్రజాసేవలో, ముఖ్యంగా రైతు సేవలో ముందంజలో ఉండడం సంతోషకరమని తెలిపారు. నాబార్డ్ సహకారంతో డీసీసీబీ బ్యాంకులు మరింత బలోపేతం అవుతున్నాయని, ప్రతి మండలంలో ఇలాంటి బ్యాంకు ఉంటే ప్రజలకు మరింత సేవలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.అవసరమైతే వరంగల్ డీసీసీబీ బ్రాంచ్ ల పెంపు పై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సహకారంతో ఆర్బీఐతో చర్చించి మరిన్ని సేవలు పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రుణాల మంజూరు విషయంలో డీసీసీబీ ప్రథమ స్థానంలో నిలుస్తోందని, రైతులు, మహిళా సంఘాలు రుణాలను క్రమం తప్పకుండా చెల్లించినప్పుడే బ్యాంకులకు మంచి పేరు వస్తుందని సూచించారు.రఘునాథపల్లి ప్రాంత రైతులు డీసీసీబీ సేవలను వినియోగించుకోవాలని, ఇన్పుట్ లోన్లు, ఎడ్యుకేషన్ లోన్లు వంటి ప్రత్యేక రుణాలు కూడా వరంగల్ డీసీసీబీ ద్వారా అందుబాటులో ఉన్నా యని తెలిపారు. మహిళా సంఘాల రుణా లు విస్తృతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. డిసిసిబి బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, నాబార్డ్ డీడీఎంలు చంద్రశేఖర్, చైతన్య రవి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాం బాబు, సర్పంచ్ ఉమారాణి పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి పది మందికి సహాయం చేసే స్థాయికి ఎదగాలి



మునుగోడు,: ప్రతి విద్యార్థి భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా ఎదిగి పదిమందికి సహాయం చేసే స్థాయికి చేరాలని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి అన్నారు. పేద విద్యార్థుల చదువుకు చేయూతనిస్తూ ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే దంపతులు మరోసారి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. మునుగోడు నియోజకవర్గంలోని 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం (2025--26)లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 151 మంది విద్యార్థులకు మొత్తం రూ. 24.50 లక్షల నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేసి మాట్లాడారు.ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించడం సమాజం బాధ్యత అని అన్నారు. "నేను బడిని గుడితో సమానంగా చూస్తాను" అని పేర్కొన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లు, డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్య రంగాల్లో పెద్ద మార్పులు తీసుకురావడం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఇలాంటి ప్రోత్సాహకాల వల్ల పేద తల్లిదండ్రుల్లో ధైర్యం పెరిగి, విద్యార్థుల్లో పోటీ తత్వం పెరుగుతోందని తెలిపారు. గత సంవత్సరం కూడా 189 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందించినట్లు గుర్తు చేశారు.మనకోసం మనం బ్రతకడం కాదు... మన చుట్టూ ఉన్న వారి కోసం బ్రతకడమే గొప్ప తనం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అందరి సహకారంతో కరీంనగర్ అభివృద్ధి

కరీంనగర్ : అందరి సహకారంతో కరీంనగర్ రూపురేఖలు మార్చి అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. నగరంలోని రేకుర్తి చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ పథకంలో భాగంగా మూడు చెరువుల పునరుజ్జీవం కోసం 5.82 కోట్ల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా 1.98 కోట్ల రూపాయలతో ఈరోజు రేకుర్తి చెరువు పునరుజ్జీవ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. డ్రైనేజీ నీరు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు రేకుర్తి చెరువును అందంగా తీర్చిదిద్ది కరీంనగర్ ప్రజలు కుటుంబాలతో కలిసి వచ్చి సేద తీరేలా మినీ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. దీంతోపాటు కరీంనగర్ గల్లీలోని రోడ్లను నిర్మించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా కరీంనగర్‌లో గుంతలు పడ్డ అన్ని గల్లీల్లో రోడ్లను నిర్మిస్తామన్నారు. కాళేశ్వరంసహా కేసీఆర్ కుటుంబం చేసిన అవినితిని కప్పిపుచ్చేందుకు రేవంత్ రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని గత ఎన్నికల్లో చటిప్పిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తొమ్మిది వేల కోట్లకే పరిమితమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణాలపైనే విచారణ జరపాలని సీబీఐకి లేఖ రాయడమే ఇందుకు నిదర్శనమన్నారు. కేసీఆర్ అవినీతి బయటపడాలంటే లక్ష కోట్ల కాళేశ్వరం నిర్మాణంపై విచారణ జరపాల్సి ఉందన్నారు. రేవంత్‌రెడ్డి మాత్రం కేసీఆర్ ను కాపాడాలనే ఉద్దేశంతోనే డిజైన్ లోపాలతో నిర్మించిన మేడగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై మాత్రమే సీబీఐ విచారణ కోరుతున్నారని చెప్పారు. రేవంత్‌కు దమ్ముంటే లక్ష కోట్ల రూపాయల కాళేశ్వరం అవినీతిపై విచారణ కోరుతూ సీబీఐకి లేఖ రాయాలని సవాల్ విసిరారు. కాళేశ్వరం విషయంలో వీళ్లు ఆడుతున్న డ్రామాలపై తెలంగాణ ప్రజలకు త్వరలోనే లేఖ రాస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ ప్రపుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు గుగ్గిళ్ల రమేశ్, బోయినిపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, సుదగోని మాధవి పాల్గొన్నారు.

## జనగణన బాధ్యతాయుతంగా నిర్వహించాలి

చొప్పదండి, : జనగణనను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అన్ని వివరాలను తప్పులు లేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని కలెక్టర్ చిత్రామిశ్రా అన్నారు. చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఏర్పాటు చేసిన మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ తప్పులు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలన్నారు. డిజిటల్ సర్వేపై అనుమానాలు నివృత్తి చేయాలని, గత సర్వేల్లో పాల్గొన్న సిబ్బంది అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మొదటి దశలో మే11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల గణన నిర్వహిస్తారని, రెండవ దశలో ఫిబ్రవరి 2027లో వ్యక్తులవారీగా సమాచారం సేకరిస్తారని ఆమె తెలిపారు. అధికారులు ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు.విద్యార్థుల భద్రతకు, ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ చిత్రామిశ్రా సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చొప్పదండిలోని ఎస్సీ సంక్షేమ శాఖ వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, మరుగుదొడ్లు, డార్మెటరీ హాల్, భోజనశాలను పరిశీలించారు. మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ,సిబ్బంది హాస్టల్లోనే ఉండాలని, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, డీపీవో జగదీశ్వర్, తహసీల్దార్ నవీన్‌కుమార్, వార్డెన్ కుమారస్వామి పాల్గొన్నారు.గ్రామాల్లో ప్రజలకు మంచి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రామిశ్రా అధికారులను ఆదేశించారు. గువ్వలూరు, కాట్నపల్లి పంచాయితీ పరిధిలోని మల్లన్నపల్లిలో మంచినీటి బావులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జనాభా అవసరాలకు అనుగుణంగా నీటిని అందించాలన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TElTEL 2010/34557, Cell: 9849758280